క్లుప్తంగా

శాకంబరిగా కురుపాం కోటదుర్గమ్మ



శాకంబరిగా దర్శనమిచ్చిన కురుపాం కోట దుర్గమ్మ

కురుపాం: మండల కేంద్రం లోని రావాడ జంక్షన్‌లో వెలసిన కురుపాం కోట దుర్గమ్మ శుక్రవారం శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసంలో అమ్మవారిని కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. పూజల్లో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు శ్రీనివాస నాయికో మాట్లాడుతూ ఇలా ఆషాడ మాసంలో కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజల చేయటం ఆనవాయితీగా వస్తుందన్నారు.

దుర్గమ్మకు ఆషాఢమాస సారె



అమ్మవారికి సారె తీసుకువస్తున్న భక్తులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల కొంగుబంగారమైన కోటదుర్గమ్మకు భక్తులు ఆషాఢమాస సారెను శుక్రవారం అందజేశారు. అమ్మవారు శాకంబరీదేవిగా దర్శనమివ్వడంతో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ, మణిలకుమార్ నేతృత్వంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తుల సమర్పించిన కూరగాయలతో తయారు చేసిన ప్రత్యేక ప్రసాదాన్ని అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఈఓ బీవీఎస్ఎస్ మురళీకృష్ణ, శ్రీనివాస్ పర్యవేక్షించారు.

జ్వరాలపై నిర్లక్ష్యం తగదు



గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి రవీంద్ర

భామిని: జ్వరాలపై నిర్లక్ష్యం తగదని బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.రవీంద్ర అన్నారు. మండలంలోని జియ్యమానుగూడలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ముందుగా వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దోమలను నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పలువురు జ్వరపీడితులకు రక్తపూతలు సేకరించారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక



ఎన్‌సీసీ క్యాడెట్లను ఎంపిక చేస్తున్న నిర్వాహకులు

భామిని: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎన్‌సీసీ జూనియర్ క్యాడెట్ల ఎంపిక శుక్రవారం నిర్వహించారు. శ్రీకాకుళం 14వ ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మెడికల్, ఫిజికల్ టెస్టులు నిర్వహించి 45 మంది విద్యార్థులను క్యాడెట్లుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్. శివకుమార్, పీడీ గొర్లె శివరామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుధ్య వారోత్సవాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామంలో శుక్రవారం గ్రామ సచివాలయం ఉద్యోగులు డ్వాక్రా మహిళలతో కలిసి పారిశుధ్య వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మండంగి జగ్గారావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పలువురు పేర్కొన్నారు. విక్రంపురం గ్రామ సచివాలయంలో సర్పంచ్ ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కళింగి మల్లేశ్వరరావు అధ్యక్షతన పారిశుధ్యంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి భీమయ్య, ఎంపీటీసీ దేవకోటి వెంకటినాయుడుపాల్గొన్నారు.

వీరఘట్టం: పారిశుధ్య పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం అన్నారు. పలు గ్రామాల్లో తహసీల్దార్ కె.జయప్రకాష్‌తో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇళ్ల ముందు డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. వీరఘట్టంలో ఈఓ రాము పర్యటించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

కిండంగిలో అవగాహన ర్యాలీ

సీతంపేట: మండలంలోని కిండంగిలో పారిశుధ్య పక్షోత్సవ ర్యాలీ నిర్వహించారు. మండల స్పెషలాఫీసర్ సింహాచలం మాట్లాడుతూ.. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమ తెరలు ప్రతి ఒక్కరూ వాడాలని సూచించారు.

సాగు గుర్తింపు కార్డుల ప్రక్రియ ప్రారంభం

- గ్రామ సభల్లో అర్హులను గుర్తించి కార్డుల మంజూరు
- భూ యజమానుల హక్కులకు భంగం వాటిల్లకుండా కార్డుల జారీ



కొమరాడలో నారు తీస్తున్న రైతులు

పార్వతీపురం: కౌలు రైతులకు సాగు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. సాగుదారులను గుర్తించేందుకు మండలాల్లో సాగు గుర్తింపు కార్డుల జారీ చేసేందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామ సభలను నిర్వహించి దిశా నిర్దేశం చేస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్‌కు ముందుగానే అంటే ఏప్రిల్‌లోనే గుర్తింపు కార్డులను జారీ చేశారు. ఆగస్టు వరకు కొనసాగించి పంట సాగుదారులను గుర్తించి అర్హులకు సాగుదారుల కార్డులను మంజూరు చేశారు.

కార్డుల జారీ ప్రక్రియ కాస్త ఆలస్యం

ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కార్డుల ప్రక్రియ కాస్త జాప్యం ఏర్పడింది. గత ఏడాది జారీ చేసిన అన్ని కార్డుల కాల పరిమితి దాదాపు కావడంతో అర్హులకు సాగుదారుల కార్డులను జారీ చేయనున్నారు. కౌలుదారులను అన్ని రకాలుగా ఆదుకొనేందుకు గత ప్రభుత్వం చట్టాని తీసుకొచ్చింది. ముఖ్యంగా ఎరువులు, విత్తనాలు సరఫరాతో పాటు పండిన వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకొనేందుకు ఈ కార్డులు ఎంతో ఉపయోగపడతాయి. అలాగే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పరిహారం మంజూరు చేసేందుకు దోహదం చేస్తుంది.

కౌలు రైతులకు మద్దతుగా నిలిచేలా..

కౌలు రైతులకు మద్దతుగా నిలిచేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల చట్టం - 2019 ప్రకారం భూ యజమాని హక్కులకు ఎలాంటి నష్టం లేకుండా సాగు చేసే కౌలు రైతులకు పంట సాగుదారు కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. సాగుదారు కార్డులిచ్చి వారికి ఆర్థిక చేయూత అందించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంట సాగుదారుల హక్కుల చట్టం అమలులోకి తెచ్చింది. భూ యజమానులకు, వారి భూమిపై ఉన్న హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా రక్షిత కౌలు దారీ చట్టం - 1956ను రద్దు చేసింది. కొత్త చట్టంలో మరికొన్ని జాగ్రత్తలు తీసుకొని కౌలుదారులను ఆదుకొంది.

నిశ్చితంగా ఉండేందుకే...

ఈ చట్టం విషయంలో భూ యజమానులు నిశ్చితంగా ఉండవచ్చని అప్పటి ప్రభుత్వం తెలిపింది. ఈ చట్టం అమల్లో భూ యజమానులు, కౌలు రైతులు ఒకరికి ఒకరు సహకరించుకోవాలని వ్యవసాయ శాఖాధికారులు గతంలో సూచనలు జారీ చేశారు. భూ యజమానుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా వారి హక్కుల రక్షణకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తూ సాగు చేసే రైతులకు పంట రుణం పొందడానికి వీలుగా సాగుదారుల కార్డు మంజూరు చేసేందుకు కొత్త చట్టం తీసుకువచ్చింది.

కార్డులు పొందడం ఎలా...

సాగుదారు కార్డు భూ యజమానికి సాగు చేస్తున్న రైతుకు మధ్య ఒప్పందాన్ని సూచిస్తోంది. కార్డుపైన భూ యజమాని (లేదా వారి ప్రతినిధి), సాగుదారు, గ్రామ పరిపాలనాధికారి (వీఆర్‌ఓ, ఆథరైజ్డ్ ఆఫీసర్) ఈ ముగ్గురు సంతకాలుండాలి. పంట సాగుదారు కార్డు కాలపరిమితి 11 నెలలు మాత్రమే. 11 నెలల తరువాత సాగుదారు మళ్లీ కొత్తగా కార్డు పొందాల్సి ఉంటుంది. రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించడం, తద్వారా వ్యవసాయ సహాయకులతో కలిసి కార్డుకు దరఖాస్తు చేయాలి.

జిల్లాలో 3,906 కార్డులు మంజూరు

జిల్లా వ్యాప్తంగా 966 గ్రామాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇంతవరకు 3,906 మందికి సాగుదారు కార్డులను జారీ చేశారు. ఈ ఏడాది జూలై ప్రారంభం నుంచి నిర్వహిస్తున్న గ్రామసభలలో అర్హులకు సాగుదారు కార్డులను మంజూరు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాలలో సాగు చేస్తున్న రైతులతో గ్రామసభలను నిర్వహించి మరింత మంది కౌలు రైతులకు సాగుదారు కార్డులను మంజూరు చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.



గరుగుబిల్లిలో నిర్వహించిన గ్రామసభ

జిల్లాలో మండలాల వారీగా కార్డుల మంజూరు ఇలా..

మండలం	సాగుదారుల కార్డుల మంజూరు	మండలం	సాగుదారుల కార్డుల మంజూరు
		గరుగుబిల్లి	316
		మక్కువ	235
పాలకొండ	185	గుమ్మలక్ష్మీపురం	236
సాలూరు	167	భామిని	297
వీరఘట్టం	236	కొమరాడ	311
పాచిపెంట	110	పార్వతీపురం	388
కురుపాం	195	బలిజిపేట	372
జియ్యమ్మవలస	303	సీతానగరం	390
		సీతంపేట	165

అవగాహన కల్పిస్తున్నాం..



గత ఏడాది మే నుంచి సాగుకార్డులు జారీ చేశాం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌలు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించాం. రైతుసేవా కేంద్రాల్లో సిబ్బందికి సూచనలు జారీ చేశాం. కాలపరిమితి తీరిన కార్డుల స్థానంలో కొత్తవి మంజూరు చేయాలని, కొత్తగా ఎవరైనా సాగుదారు కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే, పరిశీలించి సాగుదారు కార్డులను జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశాం.

– కె.రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి, పార్వతీపురం మన్యం

జీవ ప్రాజెక్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- నాబార్డ్ డీడీఎం దినేష్



పెంగవలో జీవ ప్రాజెక్ట్ కింద రైతులు సాగు చేసిన పంటలను పరిశీలిస్తున్న నాబార్డ్ డీడీఎం దినేష్

గుమ్మలక్ష్మీపురం: రైతుల ఆర్థిక స్వావలంభనే ధ్యేయంగా జట్టు ట్రస్టు ఆధ్వర్యంలో నాబార్డ్ సౌజన్యంతో అమలు చేస్తున్న జీవ ప్రాజెక్ట్‌ను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ డీడీఎం సాధు దినేష్ అన్నారు. మండలంలోని గొరడ, రాయగడ జమ్ము, పెంగవ, బాతుగుడబ గ్రామాల్లో అమలులో ఉన్న జీవ ప్రాజెక్ట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గత ఏడాది కాలంగా జీవ ప్రాజెక్ట్ అమలు తీరును రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే తమకున్న మొత్తం విస్తీర్ణంలో ఏడాది పొడవునా పంటలు పండించుకోవాలని, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు యొక్క సూచనలు సలహాలు పాటించాలన్నారు. రైతులంతా సమైక్యంగా ఉండి వారి పంటలను తగిన మార్కెట్, అదనపు ఆదాయం పొందేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజ్, కో డైరెక్టర్ ఎం.నూకం నాయుడు, జీవ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి.ప్రభోద్, కో ఆర్డినేటర్లు మురళీమోహన్, గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పాలకొండ - శ్రీకాకుళం రహదారి



ఆర్టీసీ డిపో సమీపంలో రహదారి దుస్థితి..

పాలకొండ: పట్టణంలోని పాలకొండ – శ్రీకాకుళం ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. రహదారిపై పెద్ద పెద్ద గోతులేర్పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారి విషయాన్ని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

లో ఆర్టీసీ డిపో ఎదుటగా దుస్థితి ఇది. రహదారి మధ్యలో పెద్దపెద్ద గంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంతల కారణంగా ప్రతి రోజు ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. పట్టణ పరిధిలో ప్రధాన రహదారి ఇంత దారుణంగా మారింది. దీనిపై ఎన్ని మార్లు అధికారులకు విన్నవించిన ప్రయోజనం కలుగలేదని స్థానికులు వాపోతున్నారు. అడుగు లోతులో గుంతలు ఉండడంతో వాహనాలు ఒక్కసారిగా గుంతల్లో దిగి మోరాయిస్తున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా నైన గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

- జిల్లా రవాణా శాఖాధికారి శశికుమార్



శిఖబడి వద్ద ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖాధికారి

జియ్యమ్మవలస: ట్రాక్టర్ల డ్రైవర్లు రహదారి భద్రతా నియామాలు తప్పనిసరిగా పాటించాలని మన్యం జిల్లారవాణా శాఖాధికారి ఎం.శశికుమార్ అన్నారు. ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లతో ఆయన మండలంలోని శిఖబడి జంక్షన్ వద్ద శుక్రవారం సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్లను రహదారిని దాటించేటప్పుడు ఫుల్ వీల్స్‌కు రబ్బరు తొడుగులు తప్పనిసరిగా ధరించాలన్నారు. ఇతర వాహనదారులకు ఎటువంటి అసౌకర్యం కలిగించకూడదన్నారు. రబ్బరు తొడుగులు లేకుండా ఇనుప చువ్వలతో వాహనాలను నడిపి ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వాహనాలకు భారీ జరిమానా విధిస్తామని చెప్పారు. సమావేశంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, రమేష్‌కుమార్, కాశీరాంతో పాటు రైతులు, ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న అధికారులు

కొమరాడ: వాహనదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని మోటారు ట్రాన్స్‌పోర్టు అధికారి ఎస్.రమేష్ అన్నారు. జిల్లా రవాణా శాఖాధికారి ఆదేశాల మేరకు మండలంలో అంతర్రాష్ట్ర సరిహద్దు కూనేరు వద్ద ఆర్టీసీ సిబ్బందితో కలసి వాహనాలు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక వాహన తనిఖీల్లో భాగంగా పరిమితికి మించిన లోడు, సరైన పత్రాలే లేకుండా ప్రయాణించే ఆటోలు, ఇతర వాహనాలపై ఆరు కేసులు నమోదు చేశామని చెప్పారు. వీరి నుంచి రూ.22 వేల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. తనిఖీల్లో పార్వతీపురం ఆర్టీసీ డిపో ఏడీసీలు పీఎల్ నాయుడు, కేఎస్‌కే పట్నాయిక్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆ మార్గంలో ప్రయాణం నరకం



గుమడ వద్ద క్రషర్‌తో కప్పుతున్న గోతులు

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే రహదారిపై ప్రయాణమంటే నరకప్రాయమని వాహనదారులు హడలిపోతున్నారు. ఈ రహదారి అంతర్రాష్ట్ర రహదారి కావడంతో ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు ఈ మార్గంలో భారీ వాహనాల ద్వారా పరిశ్రమలకు కావాల్సిన ముడి సరుకు వెళ్తోంది. దీంతో ఈ రోడ్డు మొత్తం భారీగా గోతులు పడడంతో ఎక్కడికక్కడ భారీ వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు గంటల తరబడి వీటి వెనుక ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. భారీ వాహనాలు ఎక్కడికక్కడ గుంతల్లో నిలిచిపోతున్నాయి. చివరకు కొన్ని సందర్భాల్లో పాదచారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో వాహనదారుల అవస్థలను చూసి స్థానికులు కొంత సొమ్మును పోగు చేసి గోతులను పూడ్చారు. దీన్ని గుర్తించిన ఆర్‌అండ్‌బీ అధికారులు గుమడ గొయ్యి వద్ద క్రషర్ బుగ్గిని వేసి గోతులను కప్పే చర్యలు చేపట్టారు.

విద్యా సామర్థ్యాలను పెంపొందించాలి : డీఈఓ



మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

కురుపాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంపొందించటంలో ఉపాధ్యాయులే కీలకమని, ఇందుకు ఉపాధ్యాయులు టీచ్ టూల్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారిణి పగడాలమ్మ అన్నారు. కురుపాం మండల కేంద్రంలోని ఉన్న ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణను ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణలో మెలకువలను నేర్చుకొని విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. శిక్షణలో ఎంఈఓ ఎన్.సత్యనారాయణ, ఎంఎస్ కో ఆర్డినేటర్లు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించాలి



శిక్షణ కార్యక్రమంలో సూచనలు చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖ అబ్జర్వర్ నేహా

పాలకొండ రూరల్: తరగతి గదిలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని రాష్ట్ర విద్యాశాఖ అబ్జర్వర్ నేహా అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉపాధ్యాయులు తమలో ఉన్న బోధనా స్థాయిని మరింతగా పెంచుకునేందుకు ఈ తరహా శిక్షణలు దోహదపడతాయన్నరు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి పి.కృష్ణమూర్తి, ఎంఈఓ కె.సోంబాబుతో పాటు నాలుగు మండలాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు హాజరయ్యారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

- ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి నారాయుడు



సిబ్బందికి సూచనలు చేస్తున్న డిప్యూటీ ఈఓ నారాయుడు

సీతంపేట: విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి పి.నారాయుడు అన్నారు. మండలంలోని ముత్యాలు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ కంప్లీట్, లెస్సన్ ప్లాన్, తరగతుల విభజన వంటి వాటిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ స్టూడెంట్ కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంఓ చిరంజీవి పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి



సబ్సిడీపై రైతుకు పవర్ వీడర్‌ను అందజేస్తున్న సభ్యులు

కురుపాం: రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా తక్కువ ధరకే రైతులకు అందిస్తున్న వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని నేటివ్ ఇకో ఆర్గానిక్ రూట్స్ ఎఫ్‌పీఓ వినోద్‌కుమార్, సీఈఓ సోనియా అన్నారు. మండలంలోని మేదరగండ గిరిజన గ్రామానికి చెందిన మండంగి రాజన్నకు పవర్ వీడర్‌ను సబ్సిడీపై శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా నేటివ్ ఇకో ఆర్గానిక్ రూట్స్ ఉద్యాన, వ్యవసాయ పరస్పర సహాయక సహకార సంఘం ద్వారా రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లు, టార్పాలిన్లు, తదితర వ్యవసాయ పరికరాలను రైతులకు పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తెరిపివ్వని వర్షాలు



గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం



భామిని: గురండి వద్ద పొలంలోకి చేరిన నీరు

సీతంపేట/భామిని: అల్పపీడన ప్రభావంతో సీతంపేట, భామిని మండలాల్లో కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉంటే పంట పొలాల్లో నీరు చేరడంతో రైతన్నలు ఉబాలకు సిద్ధపడుతున్నారు.

విస్తారంగా వర్షం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో శుక్రవారం విస్తారంగా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవటంతో రోజూవారీ పనులు చేసుకునే వారంతా ఇబ్బందుల పాలయ్యారు. పొలాలకు పుష్కలంగా నీరు చేరటంతో వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

వీరఘట్టంలో జోరువాన

వీరఘట్టం: అల్పపీడనం ప్రభావంతో మండల వ్యాప్తంగా రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం 32.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కె.జయప్రకాష్ తెలిపారు. వెదలకు ఈ వర్షాలు ఎంతో ఉపయోగకరమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆదివాసీ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

జియ్యమ్మవలస: ఆదివాసీ గిరిజన గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించి గిరిజనులకు మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాల నుంచి కాపాడాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర అన్నారు. రావాడ రామభద్రపురం పీహెచ్‌సీని శుక్రవారం సందర్శించిన ఆయన రోగులకు అందుతున్న సేవలు పరిశీలించారు. మందులు అందుబాటులో ఉంచాలన్నారు.

‘అప్రమత్తంగా ఉండాలి’

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వీఆర్‌ఓలకు తహసీల్దార్ కె.విజయ ఆదేశించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలన్నారు. వరదల సమయంలో ప్రజలు పాము, తేలు కాట్లుకు గురయ్యే ప్రమాదం ఉందని, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నీట మునిగే గ్రామాలు, బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే పరిస్థితులు గమనించాలన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- ఆర్డీఓ వెంకటరమణ



ర్యాలీ చేస్తున్న ఆర్డీఓ, తదితరులు

పాలకొండ: పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీఓ వెంకటరమణ తెలిపారు. పారిశుధ్య వారోత్సవాల సందర్భంగా మండలంలోని గోపాలపురంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ముందుగానే అప్రమత్తం కావడం ద్వారా సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ఆయనతో పాటు ఎంపీడీఓ రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిండుకుండలా నాగావళి



చిన్న మంగళాపురం వద్ద నిండుకుండలా ప్రవహిస్తున్న నాగావళి నది

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగావళి నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉంది. మరో రెండు రోజులు వర్షాలు విస్తారంగా కురిసే అవకాశాలున్నాయన్న అధికారుల సూచనలతో స్థానిక యంత్రాంగం అప్రమత్తమైంది. శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ప్రజా జీవనం స్తంభించింది. ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, పోలీస్ యంత్రాంగం సమష్టిగా నదీ తీరప్రాంతాలైన గోపాలపురం, చిన, గొట్ట మంగళాపురం, యరకారాయపురం, అన్నవరం, అంపిలి గ్రామాల్లో సిబ్బందితో కలసి సందర్శించారు. వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. మరోవైపు తాజాగా కురుస్తున్న వర్షాలకు రైతులు పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు.